క్లుప్తంగా

కుర్చీలు టై, బెల్టులు అందజేత



కుర్చీలు, టై బెల్టులు అందిస్తున్న ఈశ్వరప్ప

రేగోడ్(మెదక్): మండలంలోని ఆర్.ఇటిక్యాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు ఈశ్వరప్ప తమ సొంత డబ్బులతో శనివారం పది కుర్చీలను అందజేశారు. అదే విధంగా ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మణ్, బాల్‌రాజ్‌లు టై, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గురునాథ్, హెచ్‌ఎం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సోమేశ్వర్, ఉపాధ్యాయులు సంధ్య, శ్రీవాణి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు



స్కిపింగ్ ఆడుతున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందజేయనున్నట్లు హెచ్‌ఎం బాలచంద్రం తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, పోటీలు రెండు రోజుల పాటు నిర్వహించినట్లు పీడీ చంద్రమోహన్ తెలిపారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత



శివ్వంపేట(నర్సాపూర్): వారం రోజుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా చెట్ల నరికివేత యథేచ్ఛగా జరుగుతుంది. మండల పరిధిలోని శివ్వంపేట- ఎదుల్లాపూర్ గ్రామ శివారుల్లోని చామస్ చెరువు వాగు గడ్డపై ఉన్న చెట్లను నరికివేస్తున్నప్పటికీ సంబంధిత అటవీ శాఖ పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. చెట్లను పెంచాలని ప్రభుత్వం కృషి చేస్తుంటే వాగు శివారులోని చెట్లను అక్రమార్కులు అవేమి పట్టించుకోకుండా తొలగిస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం గురించి అటవీ సెక్షన్ అధికారి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా, పలువురు తుమ్మ చెట్లను తొలగించేందుకు అనుమతులు పెట్టుకున్నారని పరిశీలించి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉచిత పశు వైద్య శిబిరం



పశువులకు చికిత్స నిర్వహిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామంలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్యాధికారి సంధ్యరాణి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. పశువులు అనారోగ్యానికి గురైతే నాటువైద్యం చేయకుండా పశు వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగేశ్వర్‌రావు, దుర్గేశ్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ సత్యనారాయణ, సిబ్బంది రమాదేవి ఉన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

నర్సాపూర్: కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా కోసం ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి దీపిక కోరారు.

కౌడిపల్లి(నర్సాపూర్): కొత్తగా వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన రైతులు రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ స్వప్న తెలిపారు.

శివ్వంపేట(నర్సాపూర్): రైతు భరోసా పథకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. 03-12-2023 నుంచి 31-12-2024 వరకు కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు వచ్చిన రైతులందరూ మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్ జిరాక్స్ పత్రాలతో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం

భావోద్వేగానికి గురైన కౌన్సిల్ సభ్యులు



మున్సిపల్ పాలకవర్గం

మెదక్ మున్సిపాలిటీ: పదవిలో లేనప్పటికీ పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అన్నారు. మెదక్ మున్సిపల్ కౌన్సిల్ చివరి సమావేశం శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ఐదేళ్ల పదవి కాలంలో పట్టణాభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. నిధులు రాకపోవడంతో ఇంకా అక్కడక్కడ కొన్ని పనులు మిగిలిపోయాయని, కరోనా సమయంలో పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు శానిటరీ అధికారులు ప్రాణాలు పణంగా పెట్టి సేవలందించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. పారిశుద్ధ్యం, వీధి దీపాలు, నీటి సరఫరా సిబ్బంది అందించే సేవలతో ప్రజాప్రతినిధులకు మంచి పేరు వచ్చిందని చెప్పారు. రాజకీయాలకు విరమణ ఉండదని, సమాజసేవ, ప్రజాసేవ చనిపోయేంత వరకు చేయవచ్చునన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్‌రావు సహకారంతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు వివరించారు. పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడుతూ.. నమ్మి గెలిపించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్‌తో పాటు కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం

మైనంపల్లి హన్మంతరావు



శేరిపల్లిలో మాజీ ఎంపీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం చిన్నశంకరంపేట, నార్సింగి మండలంలోని జప్తిశివనూర్, శేరిపల్లి, మిర్జాపల్లి గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా శేరిపల్లిలో మాజీ ఎంపీటీసీ రామస్వామిగౌడ్ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, నరేందర్, మనోజ్, అరుణ, ప్రభాకర్, గోవర్ధన్, చిన్నకృష్ణాగౌడ్, నర్సింలుగౌడ్, మోమన్, సురేందర్, రాజాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు రావాలని ఆహ్వానం



తిమ్మాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న గౌడసంఘం నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్‌లో గౌడసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయం విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను రావాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గౌడసంఘం నాయకులు శనివారం ఆహ్వానించారు. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2వరకు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు జరుగుతాయని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామాగౌడ్, మాజీ ఎంపీటీసీలు శంకర్‌గౌడ్, కిషోర్‌గౌడ్, అంజాగౌడ్, ప్రవీణ్‌గౌడ్, భిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నస్కల్ గ్రామస్తుల దీక్ష విరమణ



దీక్ష విరమింప చేయిస్తున్న గ్రామస్తులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో 15 రోజులుగా నస్కల్ రోడ్డు నిర్మాణం కోసం చేస్తున్న రిలే నిరాహార దీక్షను ఎమ్మెల్యే రోహిత్‌రావు హామీతో విరమించారు. ఈ మేరకు శనివారం నస్కల్ రోడ్డు కోసం 15 రోజులు చేస్తున్న రిలే నిరాహార దీక్షను కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రోహిత్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకుడు మాట్లాడుతూ.. త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, నస్కల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



మనోహరాబాద్(తూప్రాన్): తాము వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చక్కగా చిత్రాలు వేసిన వారికి బహుమతులను అందజేసినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం కృపాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు బ్రహ్మాచారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తహసీల్దార్ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. శనివారం మండల తహసీల్దార్ కార్యాలయంలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి యాదగిరి, ఇన్‌చార్జి హెచ్‌ఎం మహేందర్, రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగులపల్లిలో ముగిసిన వాలీబాల్ పోటీలు



ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నాగులపల్లిలో వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. వాలీబాల్ పోటీల్లో నాగులపల్లితో పాటు పరిసర గ్రామాలకు చెందిన 6 టీములు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో నాగులపల్లికి చెందిన విజేత టీం మొదటి స్థానం కైవసం చేసుకోగా, నక్షత్ర టీం రెండో స్థానంలో నిలిచింది. వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నాగులపల్లి టీమ్‌కు వాలీబాల్ కిట్లు, ఫ్లాడ్‌లైట్లు ఏర్పాటు చేయిస్తామని తాళ్లపల్లి శ్రీనివాస్, పెంటయ్య ప్రకటించారు.

బీఎల్‌ఓలకు పెండింగ్ గౌరవ వేతనాలు చెల్లించాలి

శివ్వంపేట(నర్సాపూర్): బీఎల్‌ఓలకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు చెల్లించాలని బీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేశం డిమాండ్ చేశారు. సంవత్సర కాలంగా వీరి గౌరవ వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించి, గౌరవ వేతనం రూ.8 వేలకు పెంచాలని కోరుతూ తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం అందజేశారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

అల్లాదుర్గం(మెదక్): విద్యుదాఘాతంలో పాడి గేదె మృతి చెందిన సంఘటన శనివారం అల్లాదుర్గం శివారులో చోటు చేసుకుంది. అల్లాదుర్గంకు చెందిన దుర్గయ్య పాడి గేదెను పశువుల కొట్టంలో శుక్రవారం కట్టేసి, ఇంటికి వెళ్లి పోయాడు. గేదె తాడు తెప్పుకొని బయటకు వెళ్లి, బాలయ్య బోరు మోటారు వద్ద విద్యుత్ తీగకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె మృతితో రూ.80 వేల వరకు ఆర్థిక నష్టం జరిగిందని బాధితుడు చెప్పారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

బియ్యం గింజపై జాతీయ పతాకం



పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన సూక్ష్మకళాకారుడు శ్రీనివాస్‌చారి గణతంత్ర దినోత్సవం సందర్భంగా బియ్యపు గింజపై జాతీయ పతాకాన్ని చిత్రీకరించాడు.

అంగన్‌వాడీలో ఆటాపాట



చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శివకుమారి



చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం చేస్తున్న టీచర్లు

తూప్రాన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటా-పాటలతో పాటు విద్యాభ్యాసం జరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని ఈసీసీఈ దినోత్సవాన్ని అంగన్‌వాడీ-5వ కేంద్రంలో చిన్నారుల తల్లులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్ సుకన్య పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తినాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గర్భిణులు సరైన పోషకాహారాలు భుజిస్తేనే, శిశువు ఆరోగ్యంగా పుడుతుందని అంగన్‌వాడీ టీచర్లు శశికళ, యాదమ్మ అన్నారు. శనివారం మండలంలోని చండూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, తల్లులు, మహిళలు పాల్గొన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): రాయిలాపూర్ కేంద్రంలో..

నాణ్యమైన విద్యబోధన

కౌడిపల్లి(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు ఆటాపాటలతో నాణ్యమైన విద్యబోధన చేస్తున్నట్లు ఐసీడీఎస్ రాయిలాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించే వారిపై ఫిర్యాదు

నర్సాపూర్ రూరల్: విధులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ ఎంపీఓ వైద్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాల కార్యదర్శులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల జక్కపల్లి ప్రజలు గ్రామ కార్యదర్శి స్రవంతి విధులకు ఆటంకం కలిగించి దూషించారని తెలిపారు. దీంతోపాటు నత్నయపల్లి కొంతమంది గ్రామస్తులు కార్యదర్శి సంగీత విధులు నిర్వహిస్తుండగా తరచు ఆటంకం కలిగిస్తున్నారని చెప్పారు. దీంతో పాటు మండలంలోని మిగతా గ్రామాల్లో సైతం గ్రామ కార్యదర్శుల విధులకు ఆటంకం కలిగిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. తమకు రక్షణ కల్పించాలని కోరుతూ.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయమై నర్సాపూర్ ఎస్‌ఐ లింగం వివరణ కోరగా కేసులు నమోదు చేసేంత సమస్యలు లేవన్నారు. ఆయా గ్రామాల ప్రజలకు కౌన్సెలింగ్ చేస్తామన్నారు.

మోసపూరిత వాగ్దానాలపై పోరాడుతాం



పొలంపల్లిలో అమరుల జ్యోతి ర్యాలీ ప్రారంభిస్తున్న మల్లేశం

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలపై పోరాటం చేస్తామని సీపీఎంఐ జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. శనివారం మండల కేంద్రం మీదుగా అమరజ్యోతి బైక్ ర్యాలీగా వెళ్తూ ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేఖంగా అమర జ్యోతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎంఐ నాయకులు ఉన్నారు.

సీపీఎం అమరవీరుల స్తూపజ్యోతి ర్యాలీ

కొల్చారం(నర్సాపూర్): సంగారెడ్డిలో శనివారం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర మహాసభలకు సీపీఎం అమరవీరుల స్తూపజ్యోతి మండలంలోని రంగంపేట మీదుగా ఆ పార్టీకి చెందిన జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేశం ఆధ్వర్యంలో ర్యాలీగా తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్ర సాయుధ పోరాటంలో అనేకమంది త్యాగాల ఫలితంగానే నేడు ఉద్యమాలు సాగుతున్నాయన్నారు.

రాష్ట్ర మహాసభలకు అమరవీరుల జ్యోతి

చేగుంట(తూప్రాన్): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలకు చేగుంట మండలంలోని పొలంపల్లి కేవల్ కిషన్ సమాధి నుంచి అమరవీరుల జ్యోతి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభలకు అమరవీరుల జ్యోతితో ర్యాలీగా తరలి వెళ్తున్నట్లు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే ప్రధానం

జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పాఠశాల విద్యార్థులతో ఓటర్ అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పలువురు అధికారులు మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు.



రేగోడ్(మెదక్): ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



అల్లాదుర్గంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



నర్సాపూర్: ర్యాలీలో పాల్గొన్న ఆర్‌డీఓ మహిపాల్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



శివ్వంపేటలో ర్యాలీ



మెదక్ మున్సిపాలిటీ: పాఠశాల విద్యార్థులను అభినందించిన అదనపు కలెక్టర్ నగేష్



నర్సాపూర్ రూరల్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ దామోదర్



వెల్దుర్తి(తూప్రాన్): అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

సంక్షిప్త వార్తలు

◆ **చిత్తారమ్మ ఆలయ వార్షికోత్సవం**

రామాయంపేట(మెదక్): పట్టణంలోని చిత్తారమ్మ ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం సగర సంఘం వారి ఆధ్వర్యంలో చండీ హోమం, పల్లకీసేవ నిర్వహించారు.

◆ **వాహనాలు జాగ్రత్తగా నడపాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. ఓవర్ లోడ్‌తో వెళ్లొద్దని, రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించని పలు వాహనాలకు ఆన్‌లైన్ ద్వారా జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా స్వామి**

చిన్నశంకరంపేట(మెదక్): మండల ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. శనివారం చిన్నశంకరంపేటలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దయాకర్, ప్రధాన కార్యదర్శిగా మల్లేశంగౌడ్, కోశాధికారిగా సిద్ధిరాములు, నాగరాజు ఎన్నికయ్యారు.

◆ **మడూర్ సొసైటీ చైర్మన్ అక్రమాలపై మరోసారి ఫిర్యాదు**

చిన్నశంకరంపేట(మెదక్): మడూర్ సొసైటీ చైర్మన్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండలంలోని మిర్జాపల్లిలో రైతులు మైనంపల్లి హన్మంతరావుకు ఫిర్యాదు చేశారు. శనివారం మిర్జాపల్లిలో పర్యటించిన మైనంపల్లి దృష్టికి రైతులు మడూర్ సహకార సంఘం చైర్మన్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన అదనపు కలెక్టర్ నగేష్‌కు ఫోన్ చేసి మడూర్ సొసైటీ చైర్మన్‌పై విచారించి చర్యలు చేపట్టాలన్నారు.

◆ **నీటి సమస్య తీర్చేందుకు చర్యలు**

నర్సాపూర్: తన వార్డులో నీటి సమస్య తీర్చేందుకు బోరు వేయించినట్లు పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ సరిత అన్నారు. శనివారం తన వార్డులోని హనుమాన్ ఆలయం సమీపంలో బోరు డ్రిల్లింగ్ పనుల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, కౌన్సిలర్లు రాంచందర్, లలిత, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, భిక్షపతి, మహ్మద్ పాల్గొన్నారు.

◆ **అంబేడ్కర్ ఫొటో పెట్టాలి**

నర్సాపూర్: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అంబేడ్కర్ ఫొటో తప్పనిసరిగా పెట్టాలని రాష్ట్ర మాలల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైసయ్య డిమాండ్ చేశారు.

మెదక్ కలెక్టరేట్: గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండాల వద్ద అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు చేయాలని మాలల హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు మైసయ్య శనివారం తెలిపారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా జరుపుకుంటున్న వేడుకల సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద అంబేడ్కర్ చిత్రపటాన్ని పెట్టాలని కోరారు.

◆ **ఫిబ్రవరి 5న ముదిరాజ్ సమావేశం**

నర్సాపూర్: ముదిరాజ్ సంక్షేమ సమితి నర్సాపూర్ నియోజకవర్గ సమావేశం ఫిబ్రవరి 5న నర్సాపూర్‌లో ఏర్పాటు చేసినట్లు ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కన్వీనర్ నారాయణ ముదిరాజ్ చెప్పారు. ఆయన శనివారం మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులు పలు అంశాల్లో అవగాహన లేక నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమను బీసీ డీ నుంచి ఏ గ్రూప్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

◆ **పాఠశాలలో మాక్ పోలింగ్**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నారాయణ మాక్ పోలింగ్‌లో పాల్గొని ఓటు వేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి గాంధీ చౌరస్తా వరకు ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నీరజ, ఎంపీడీఓ చిన్నారెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

◆ **సైబర్ నేరాలపై అవగాహన**

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లిలో పోలీస్‌శాఖ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ రాంబాబు మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు చేసే మోసాలు, లాటరీ వంటి ఆశ చూపి ఖాతాలో నుంచి డబ్బులు కాజేసే విషయాలపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.